320068901

ఇంద్రియంబులు మనసు నిలిపిన అంధుడైనను ముక్తి పొందును
ఇంద్రియంబుల నిగ్రహించని చంద్రుడైన వసంతు తోడను
కన్ను విప్పి చూడ రోరన్నా
ఈ సాయి దేవుని యెన్నగా యెందైన కలడన్నా
మున్ను షిరిడి నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావన చేయు భక్తుల కన్నులందే మెలగునన్నా
కన్ను విప్పి చూడ రోరన్నా!

విద్యార్థులారా!

భారతీయ సాంప్రదాయము నందు ధర్మ, అర్థ కామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములు మానవునకు అత్యంత ప్రధానము. కానీ వీటిని సర్వమానవులు అనుసరించుటకు, ఆనందించుటకు తగిన శక్తి సామర్థ్యములు లేక పోవచ్చును. మానవునకు ప్రధానమైన చతుర్విధానములున్నవి. వాటిని సక్రమముగా అర్థము చేసుకొనుటకు ప్రయత్నించినప్పుడే ధర్మార్థకామ మోక్షములు కూడను సులభముగా ఆచరించుటకు వీలవుతుంది. ఇప్పటి విద్యార్థులకు యివి చాలా అవసరము. వీటిని అర్థము చేసుకున్నప్పుడే సమస్తాన్ని కూడను వీరు అర్థము చేసుకోగలరు. వీటిని అర్థము చేసుకోలేక పోవటం చేత అనేక రకములైన అనర్థములు ప్రవేశించి మానవుని యదార్థమును మరచి పోతున్నారు. మొదటిది మైత్రి. రెండవది కరుణ. మూడవది ముదిత. నాల్గవది ఉపేక్ష. ఇవే ప్రతి మానవునకు అత్యవసరమైన, ప్రధానమైన చతుర్విధాలైన ధర్మములు. ఐతే వీటికి తగిన అర్థములు చెప్పేవారు లేక పోవటం చేతను, చింతించే శక్తి సామర్థ్యములు లేక పోవటం చేతను, మైత్రి అనగా ఒక విధమైన friendship అని ఒక విధమైన స్నేహమని మాత్రము భావిస్తున్నారు.

స్నేహమంటే ఏమిటి? ఎవరితో స్నేహము చెయ్యాలి, ఎట్లా చేయాలి అనే సత్యాన్ని మొత్తము విచారించాలి. అందరితోను స్నేహము చేయకూడదు. తనకు సరైన సమానత్వాన్ని గుర్తించి స్నేహము చెయ్యాలి. తన వయసుకు, తన సంపదకు తన ఆరోగ్యమునకు, తన చదువుకు, తన పరిస్థితికి తగిన వారితోనే స్నేహము చెయ్యాలి. అధికులతోగాని, చిన్నవారితోగాని స్నేహము చేయకూడదు. ఇది స్నేహమునకు సరియైన అర్థము. అధికులతో స్నేహము చేసినప్పుడు అతను నిన్ను లొంగదీసుకొనుటకు ప్రయత్నించవచ్చు. దీనికి విరుద్ధము జరిగినప్పుడు నీ స్నేహమునకు భంగము కలుగవచ్చు. చిన్న

320068902

వారితో స్నేహము చేసినప్పుడు నేను వాళ్లను అదుపులో పెట్టుటకు ప్రయత్నించవచ్చును. వాడు దానిని అంగీకరించకుండా పోయినప్పుడు తిరిగి యీ స్నేహమూ భిన్నము కావచ్చును. కనుకనే వయస్సు, స్థితి, సంపద, విద్య యిలాంటి పరిస్థితులు సమానముగా వుండినవారితో స్నేహము చేసినప్పుడే అది శాశ్వతమైన స్నేహముగా రూపొందుతుంది.

ఇంక కరుణ. ఈ కరుణను యిష్టము వచ్చినట్లుగా మనము ప్రసరింప చేయకూడదు. మనకంటె చిన్నవారిపైన కరుణను చూపాలి. వయసునందు సంపదయందు, దేహమునందు, చదువునందు యింకే పరిస్థితులయందు కూడను మనకంటె తక్కువ స్థాయి యందు వుండిన వారిపైననే మనము కరుణ చూపాలి. అప్పుడే యీ కరుణకు విలువ అధికమవుతుంది. కరుణ యొక్క స్థాయి కూడను బలిపడుతుంది.

ఇంక ముదిత. ముదిత అనగా అనేక మంది మనకంటె కొంత అధికులుగా వుంటుంటారు. ఈ అధికులను చూచి మనము ఆనందించాలి. మనకంటె ఆరోగ్యములో చక్కగా వుండిన వ్యక్తిని చూచినప్పుడు మనము ఆనందించాలి. మనకంటె అధిక సిరిసంపదలలో కూడిన వారిని చూచి మనము ఆనందించాలి. మనకంటె అధికస్థానములో వున్న అధికారులను చూచి మనము ఆనందించాలి. మనకంటె వుత్తమమైన మార్కులను అందుకొనే వ్యక్తిని చూచి మనము ఆనందించాలి. కనుక ముదిత అంటే మనకంటె అధికులను చూచి అసూయ పడకుండా యింకే విధమైన దుర్భావములను ప్రవేశపెట్టకుండా ఆనందించేటువంటిదే.

ఇంక ఉపేక్ష. అపేక్ష ఉపేక్ష అంటారు. అపేక్ష అంటే యిష్టపడటం ఉపేక్ష అంటే యిష్టపడకుండా పోవటము. చెడ్డ చేసే వారిని మనము యేమాత్రము యిష్టపడకూడదు. ఇతరులకు కీడు చేసే వారిని చూచినప్పుడు మనము యిష్టపడకూడదు. దుర్బుద్ధులతో దురాలోచనలతో, దుష్ప్రవర్తనతో, దుశ్చింతలతో మెలిగే వ్యక్తులను చూచి మనము యేమాత్రము కూడను స్నేహముగా తీసుకోకూడదు అంగీకరించకూడదు. దుర్గుణములు దురాలోచనలు దుష్ప్రవర్తనలు కలిగిన వారిని మనము యేమాత్రము యిష్టపడకూడదు. ఈ నాల్గింటిని మనము చక్కగా ఆచరణలో పెట్టినప్పుడు యింతకంటె గొప్ప పురుషార్థములు మరొకటి లేవు. సరిసమానమైన వానితో స్నేహము చేయటము, తక్కువ వానిపైన కరుణ చూపటము, ఎక్కువ వాని ఆధిక్యము చూచి ఆనందించటము, దోషులను చూచి దూరముగా వుండటము యీనాలుగే నిజమైన పురుషార్థములు.

ఈ పురుషార్థములలో మనము చక్కగా సక్రమముగా ప్రవర్తించలేదు. కనుకనే మన యొక్క స్థితిగతులు దిగజారిపోతుందాయి. విద్యార్థిగాని లేక మరొక వ్యక్తిగాని తాను ధరించు దుస్తులు గాని, తాను ధరించే నగలుగాని తాను

320068903

తన దేహమును గాని నిరంతరము పరిశుద్ధముగా నుంచుకొనుటకు ప్రయత్నించాలి. ఇది బహిశ్శౌచము. యింత మాత్రం కాదు. మన చిత్తము కూడను శుద్ధిగావించుకోవాలి. మన భావములను పరిశుద్ధి చేసుకోవాలి. కనుకనే అంతర్బహిః పరిశుద్ధి అనటువంటిది. ఈ అంతః పరిశుద్ధిని మనము ఏ రీతిగా గావించుకోవచ్చు? బయట వున్న మాలిన్యాన్ని కడుక్కోవచ్చు, తుడుచుకోవచ్చు. కాని లోన వున్న మాలిన్యాన్ని మనము ఏ రీతిగా తెలుసుకోగలము? ఏ రీతిగా చూడగలము? ఏ రీతిగా దీనిని పరిశుద్ధము చేయగలము? దీనికి సరియైన మార్గము ఒక్కటే ఒక్కటి. ప్రతి జీవి యందు ప్రతి ప్రాణి యందు క్రిమికీటకాదులు మొదలుకొని సర్వ ప్రాణుల యందు వున్నది భగవంతుడే అనే విశ్వాసాన్ని మనము అభివృద్ధి పరచుకుంటే యీ చిత్తశుద్ధి కలుగుతుంది. ఈశావాస్యం అన్నిటియందు వసించినవాడు భగవంతుడే. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించి వర్తించినప్పుడే మనము చిత్తశుద్ధి గావించుకొన్నవారమౌతాము. అఖండ సచ్చిదానంద స్వరూపమైన దివ్యత్వము సర్వత్రా వుంటున్నది. అందులో ఏది మంచిదని ఏది చెడ్డదని ఎవరు నిర్ణయించగలరు? ఒకవేళ యిది మంచి యిది చెడ్డదని నిర్ణయించటానికి పూనుకున్నప్పుడు దీనికి ఏదో రెండవ పదార్థము ఒకటి వుండినప్పుడే మంచి చెడ్డ అని నిర్ణయించుటకు సాధ్యమవుతుంది. రెండవ పదార్థము యిక్కడ లేదే. కనుక దీనిని మంచి దీనిని చెడ్డ అని నిర్ణయించటానికి వీలౌతుంది. ఈ విధముగా విచారణ చేసినప్పుడు రెండవ పదార్థము ఒకటి వున్నదని అజ్ఞానులు భావిస్తుంటారు. అదే దేహాభిమానము. ఈ దేహమనేది రెండవది వున్నది అనుకున్నప్పుడే యిది చెడ్డది అది మంచిది అనే మంచి చెడ్డ నిర్ణయానికి ప్రవేశిస్తాడు. కాని దివ్యత్వాన్ని మంచి చెడ్డలని చెప్పటానికి ఎవరికి సాధ్యము కాదు. ఎవరు నిర్ణయించలేరు.

ఒక చిన్న ఉదాహరణము. ఒక మట్టి పాత్ర వుంటుండాది. చెక్క పాత్ర వుంటుండాది. కాపర్ పాత్ర వుంటుండాది. యిత్తడి పాత్ర వుంటుండాది. వెండి పాత్ర వుంటుండాది. ఈ అన్ని పాత్రలనిండుకు నీరు పెట్టినప్పుడు అన్ని పాత్రలయందు ఒకే సూర్యుడు వెలుగుతున్నాడు. ఏ పాత్రలో వుండిన సూర్యుడు చెడ్డవాడని, ఏ పాత్రలో వుండిన సూర్యుడు మంచివాడని నీవు ఎట్లా నిర్ణయించగలవు? పాత్రలకు తగిన విలువను నీవు అందించవచ్చు. ఈ మట్టి పాత్ర చాలా తక్కువ వెల, యీ బంగారు పాత్ర ఎక్కువ వెల. ఈ విధముగా దానికి వెలనందించటానికి సాధ్యమవుతుందే గాని యిందులో కనుపించే ప్రతిబింబమైన సూర్యునికి యే విధముగా వెలనందించటానికి, ఏ విధముగా మంచి చెడ్డలు నిర్ణయించటానికి సాధ్యమవుతుంది? ఇక్కడ మంచి చెడ్డ ఏమిటి? పాత్రలు ప్రకృతికి సంబంధించినవి. ఈ సూర్యుడు పారమార్థికమైన సంబంధము. కనుకనే పాత్రలు చెడ్డవి. సూర్యుడు మంచివాడు. సూర్యుడు అనంతమైన ప్రేమ సముద్రము జీవుడు ప్రేమ స్వరూపుడు. ఈ పాత్రనే లేక నీరు నిలువలేదు. నీరే లేకుండిన

సూర్యుని ప్రతిబింబాన్ని మనము చూడలేము. కాబట్టి సూర్యప్రతిబింబాన్ని దర్శించటానికి పాత్ర మనకత్యవసరము. ఈ పాత్ర లోపల జలము కూడను అవసరమే. ఈ జలమే మనస్సు. ఈ పాత్రనే మనదేహము. ఇందులో ప్రతిబింబించే సూర్యుడే మన ఆత్మ. కనుక అందరియందు వుండిన ఆత్మ ఒక్కటేగాని యిందులో భేధములు పాత్రభేధములు మాత్రమే. ఉపాధి భేధములు మాత్రమే. ఈ విధముగా మనము విచారము చేయటానికి పూనుకున్నప్పుడు ప్రతి ఒక్క దోషము కూడను దేహ మనస్సులతోనే యేర్పడుతున్నది. కొన్నిపాత్రలలో మలినమైన జలము వుండవచ్చును. కొన్ని పాత్రలయందు చంచలము గా కదిలే జలము వుండవచ్చును. కొన్ని పాత్రలయందు పరిశుద్ధమైన జలము వుండవచ్చును. పరిశుద్ధ జలములో కనుపించే సూర్యుడు సాత్వికమని, చలించే జలములో కనుపించే సూర్యుడు రాజసికమని, మలినమైన జలములో కనుపించే సూర్యుడు తమోగుణమని నీవు నిర్ణయించుకోవచ్చు. కనుక మనము యీనాడు పరిశుద్ధము చేసుకోవలసినది యేమిటి? మనము యీ రజోగుణము, తమోగుణములనే చంచలత్వమాలిన్యములు లేకుండా మనస్సును పరిశుద్ధము చేసుకోటానికి తగిన కృషి చేయాలి. ఇది ఏరీతిగా పరిశుద్ధము చేయవలెను? ఏరీతిగా నిశ్చలత్వాన్ని సాధించాలి? ఈ నిశ్చలత్వమునకు నిర్మలత్వమునకు మనము చేయవలసిన సాధన యేమిటి?

ఈనాడు మానవుడు తన దోషములను తాను కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. పరుల దోషములను వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ రెండు గుణములు వుండినంతవరకు యితని హృదయము యే మాత్రము పరిశుద్ధము కాదు. ఇట్టి మానవునకు నిశ్చలత్వము యే మాత్రము ప్రాప్తించదు. తనయందున్న దోషములను యితరులయందున్న మంచిని గుర్తించటానికి ప్రయత్నించిన వాని హృదయమే పరిశుద్ధము, పవిత్రము, నిశ్చలము అవుతుంది. కానీ యీనాటి మన ప్రయత్నములన్నీ భౌతికమైనవి, ప్రాకృతమైనవి, ఆడంబరమైనవిగను ఆచరిస్తున్నాము. ఈ ఆడంబరమే మానవుని అధఃపతనము గావిస్తుండాది. ఎన్నివిధముల ప్రయత్నము చేసినప్పటికి ఆత్మతత్వాన్ని మనం అర్థము చేసుకోలేక పోతున్నాము. ఒక విద్యార్థి చెప్పెడు స్వామి తత్వము అర్థము చేసుకోటం కష్టమైనప్పటికిని దానిని మనము అనుసరించినప్పుడు ఆ ప్రాప్తిని మనం పొందవచ్చును. అన్నాడు. ఐతే యిది పొందటానికి తగిన మార్గమేది? స్వామికిని మనకును వుండిన సంబంధ బాంధవ్యము లోపల యేదో ఒక తప్పు వున్నదని ఆ విద్యార్థి చెప్పాడు. ఈ దోషము యెక్కడ వుంటున్నాది? అనేక మంది అనేక రకములుగా భావించవచ్చు ఊహించవచ్చును. నీవు ఎలాంటి పరిస్థితియందు వుండినప్పటికిని దానిని నీవు గ్రహించి సహించి దానిని సాధించే వుపాయానికి ప్రయత్నించాలి. అట్లు కాకుండా నీలోనే దోషము అభివృద్ధి గావించుకుంటూవస్తే ఎలాంటి ప్రదేశములో వుండినప్పటికిని, ఎలాంటి సంఘములో వుండినప్పటికిని

ఎలాంటి దివ్యమైన మందిరములయందు వుండినప్పటికిని యిది యేమాత్రము వీలు కాదు. ఎన్ని దోమలు వుండినప్పటికిని ఆ దోమలున్న గదిలో దోమతెర కట్టుకుంటే యీ దోమల బాధ మనకు యేమాత్రము వుండదు. దోమలు వుండినప్పటికిని దోమ తెర కట్టుకున్నప్పుడు మనకు బాధ వుండదు. కానీ దోమ తెరలోనే దోమలుంటే దీని ఎవరు సాధించటానికి గాని, తప్పించటానికి గాని సాధ్యము కాదు. అదే విధముగ నేమీరు దోమ తెరలో దోమలు చేర్చుకున్నారు. దోమ తెర ఎందుకోసం కట్టుకున్నావు. దోమలనుండి తప్పించుకునే నిమిత్తమై దోమతెర కట్టుకుని ఆ దోమలను దోమతెర లోనే పెట్టుకుంటే ఎవరి దోషము? కనుక మనము చేసే విధివిధానములో విజ్ఞాన ప్రజ్ఞానములు లేకుండా మనం ప్రవర్తిస్తున్నాము. అందరికి భక్తి ప్రపత్తులు వుండవచ్చును. స్వామి అంటే చాలా ప్రేమ వుండ వచ్చును. కాని ప్రేమ వుండినంత మాత్రమున చాలదు. ప్రవర్తన అత్యవసరము. అట్టివారికి భగవత్తత్వాన్ని చక్కగా గుర్తించుకున్నప్పుడే దీన్ని సరైన మార్గములో వుంచుకోటానికి వీలవుతుంది. మనము రోడ్డులో ప్రయాణమై పోతుంటాము. రోడ్డు ప్రక్క పెద్ద వృక్షము వుంటుండాది. ఈ వృక్షమంతా చక్కగా కళకళలాడుతూ వుంటుంది. చక్కని జీవకళలో వృద్ధి పడుతుండాది. మరొక ప్రక్క చిన్న వరిపైరు వుంటుండాది. రెండు దినములు నీరు కట్టకుండా పోవటంచేత వరిపైరంతా ఎండి పోయినట్లుగా కనుపిస్తుండాది. అంత పెద్ద చెట్టు యింత పచ్చగా కళకళలాడుటయేమిటి, యీ చిన్న పైరు ఒకదినం నీరులేక పోవటంచేత యీ విధముగా కృంగిపోవటం యేమిటి? దీని అంతరార్థమును మనము చక్కగా విచారణ చేసినప్పుడు యీ పెద్ద వృక్షము వేర్లు నీటిమట్టము వరకు దిగిపోయినాయి. దానివల్ల దీనికి యేమాత్రం చింత లేకుండా చక్కగా కళకళలాడుతుండాది. ఈ చిన్న పైరు వేర్లు నీటిమట్టం వరకు దిగలేదు. కాబట్టి యిది పైపైనే యెండిపోతుండాది అని తెలుస్తుంది. ఎవరి మనస్సు హృదయం వరకు దిగుతుందో వారి జీవితం కళకళలాడుతుంది. కిలకిల నవ్వుతుంది. ఎవరి మనసు భగవంతుని ప్రేమ వరకు చేరకుండా వుంటుంటాదో వారి జీవితము విలవిల తన్నుకుంటుంది. మలమల మాడుతుంది. కనుక యీ ఆనందమునకు, యీ దుఃఖమునకు వుండిన కారణము ఏమిటి? మనం చెప్పిన మాటలను చర్యలలో చూపకుండా వుండటానికి కారణమేమిటి? మన మనస్సు అంతలోతుగా దిగిపోలేదు. కేవలము పైపైనే వుంటుండాది. వేర్లు కూడా వున్నాయో లేదో చెప్పటము కష్టము.

భరతుడు కేకయ రాజ్యము నుండి అయోధ్యకు వచ్చాడు. వచ్చి తండ్రి మరణవార్త విన్నాడు. ఈ మరణమునకు కారణమేమని తల్లిని ప్రశ్నించాడు. ఆమె ఒక గొప్ప ఘనకార్యము చేసినట్లుగా 'నాయనా దీనికి నేనే కారణము. నీకు రాజ్యము నిచ్చి నిన్ను ఉన్నతస్థాయికి చేర్చే నిమిత్తమే నేను యీ కోరిక కోరినాను. అప్పుడు

320068906

చింత చేత మీ నాన్నగారు మరణించారన్నది తన దృష్టికి, తన భావమునకు అది ఘనముగా వుండవచ్చును. కాని భరతుని మనసుకు అది కఠినముగా కన్పించింది. 'క్రూరురాలా! చెట్టును కొట్టి కొమ్మను నాటటం యేమైనా బుద్ధితనమా?' అన్నాడు. అదే రీతిగా దైవత్వమనే దాన్ని మీరు త్రుంచుతున్నారు. ప్రకృతి తత్వమనే కొమ్మలు నాటి చూపిస్తున్నారు. భరతుడు కైకను యింకా యే విధముగా నిందించాడో తెలుసునా? 'సూర్యవంశము కీర్తిని నిలబెట్టటానికి వచ్చిన దానవు కాదు. సూర్యవంశపు కీర్తిని శూన్యము గావింప వచ్చిన దానవు నీవు' అన్నాడు. అదే విధముగనే మనము భక్తులము, భక్తులమని వస్తున్నాము. భక్తిప్రపత్తులు నిలబెట్టే నిమిత్తమై మనము వస్తున్నామా లేక స్వార్థ స్వప్రయోజనముల నిమిత్తమై వస్తున్నామా అనే విషయాన్ని మనం విచారిస్తే నీకు నీకే జవాబు దొరుకుతుంది.

ఈ నాటి విద్యావిధానము లోపల అనేక మార్పులు కలుగుతున్నాయి. కాని యీ మార్పులన్నీ కూడను ఎక్కడకు కొనిపోతున్నాయి? మానవత్వాన్ని పతనముగావించే స్థానమునకు గొనిపోతున్నాయి. మన ప్రాచీన సాంప్రదాయమంతా హాస్యాస్పదంగా చూస్తున్నాము. మన శాస్త్రములు, మన ధర్మములు అమాయకులైన ప్రజలను మోసగించే నిమిత్తమై ఏర్పడిన తంత్రములుగా భావిస్తున్నారు. చాలా పొరపాటు చాలా పొరపాటు. ప్రాచీన సాంప్రదాయములు ప్రాచీన సదాచారములు, ప్రాచీన ధర్మములన్నీ కూడను మానవోద్ధార నిమిత్తమై యేర్పడినవి. మానవత్వాన్ని మహా తత్వంగా మార్చే నిమిత్తమై యేర్పడినవి. ఈ నాటి విద్యావిధానములో పరిశోధనలు అధికమైపోతున్నాయి. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆశిస్తున్నారు. ప్రతి ఒకటి పరిశోధన చెయ్యాలి. ఇందులో ప్రత్యక్షము మనకు చాలా ప్రమాణము. ప్రత్యక్ష ప్రమాణమునకు లొంగనిది మనము యేమాత్రము విశ్వసించకూడదు. ఈ విధమైన సిద్ధాంతములలో గ్రుడ్డి మానవులు మునిగిపోతున్నారు. మూర్ఖ జీవులు దీనినే విశ్వసిస్తూ వస్తున్నారు. ఈ నాటి పరిస్థితి, యీనాటి వాతావరణము యీ విధమైన స్థితిగతులలో చిక్కుకొని వుంటుండాది. నిజమే ప్రత్యక్ష ప్రమాణము అత్యవసరమే. కాని భారతీయ సంస్కృతి యందు కేవలం రూపము మాత్రమే కాదు దానికి సాధన కూడా వుంటుండాలని బోధిస్తూ వచ్చింది. దానినే ఉపనిషత్తులు 'రసోవైసః' రసస్వరూపమనేది లేకుండా యిదంతా నీరసమేనని. మీరు చూడవచ్చును. ఈ నాడు ప్రత్యక్ష ప్రమాణము చాలా సత్యమైనదని భావిస్తుంటారు. plastic grapes అటా వున్నాయి plastic mangoes వున్నాయి plastic bananas వున్నాయి. ఇది ప్రత్యక్ష ప్రమాణమే కదా! రూపం కనబడుతోంది కదా! నీవు భుజిస్తున్నావా? కారణమేమిటి? ఆకారమున్నదిగాని దాని సారము లేదు. ఈ నాటి experiments are plastic fruits వంటివి. వీటిల్లో భగవత్తత్వమనే రసము లేకుండా పోతుండాది. దీనినంతా మీరు నిజమని అంగీకరిస్తున్నారంటే యెంత తెలివి తక్కువ వాళ్ళో మీరు యోచించండి. ఇంతే కాదు

ప్రత్యక్షంగా కొన్ని చూడటానికి సాధ్యము కానటువంటివి సత్యస్వరూపాన్ని ధరించాయి. ఒక దుఃఖమనుకోండి లేక ఆనందమనుకోండి దీనికి రూపము లేదు. దీనికి యెదప్రత్యక్షమూ కాదు. దీనికి రూపం లేదు ప్రత్యక్షం కాదు కాబట్టి నమ్మకూడదంటే నీ నమ్మకంపైని ఆధారపడి వుంటాయా యీ దుఃఖ ఆనందములు. నీవు దుఃఖముగా వుండవచ్చును. నీ మిత్రుడు వచ్చి దుఃఖమునకు యేమి రూపో చూపండి లేకపోతే నిన్ను నమ్మనంటాడు. 'ఒరే పిచ్చివాడా! నీవు నమ్మితే నమ్ము వదులితే వదులు దుఃఖము మాత్రం నన్ను బాధిస్తుందాది. దీనిని యే రీతిగా చూపటానికి వలవుతుంది!" అంటావు. ఈ విధముగా విచారణ చేస్తూ పోతే తన మనస్సనేది తనకు కనుపిస్తున్నాదా? తన బుద్ధి తనకు కనుపిస్తున్నాదా? ఈ అంతఃకరణ తనకు కనుపిస్తున్నాదా? దీన్ని యే రీతిగా తాను విశ్వసిస్తున్నాడు. నా మనసు ఎక్కడెక్కడకో పోతుందాదట. మనసు కనుపించటం లేదే. దీన్ని ఎట్లు నమ్ముతున్నావు. దీనికంతా అనుభూతులే మూలకారణము. ఈనాటి విద్యలంతా యీ విధమైన స్థితిలో అభివృద్ధిగావటం చేతనే మానవత్వము మరుగుపడిపోతున్నాది. ప్రతి పదార్థమునందు కూడను మనము పరతత్వాన్ని విశ్వసించాలి. ఈ పరతత్వము పైన విశ్వాసము లేని మానవుడు ప్రాకృతమైన జీవితములో వ్యర్థ జీవితము గడిపినవాడే.

ఒకానొక సమయములోపల శివాజీ సమర్థ రామదాసునకు కొంత ధనము, కొన్ని వస్త్రములు, ఆభరణములు పంపించినాడు. ఇతను నిరంతరము దానధర్మములందు కాలము గడిపేవాడు. పవిత్రమైన త్యాగము పూనిన వ్యక్తి. అతను చాలా బీదవాడు. సర్వసంగపరిత్యాగి. అలాంటి వ్యక్తి మంచి కార్యములు చేస్తున్నాడని శివాజీ అంగీకరించాడు. ఆ త్యాగికి యిలాంటివన్నీ పంపించినప్పుడు తాను యెంతైనా సద్వినియోగము చేస్తాడు, అతడు పాపం అనాథుడని తన పరివారముతో చెప్పి పంపించాడు. వీరంతా పల్లకిలో తీసుకొని వెళ్ళి అతని యింటి ముందు దింపారు. సామానంతా యింటిలో వుంచారు. నలుగురు మోసుకొనిపోయె పల్లకిని ముందు పెట్టారు. రామదాసు నది నుండి స్నానం చేసి యింటికి వచ్చాడు. అక్కడున్న శివాజీ పరివారమును చూచాడు. 'ఎవరండి మీరు? ఎందుకోసమొచ్చారు. మా యింటిలో వున్నది యిద్దరే. మేమిద్దరము క్షేమముగా వున్నాము. నలుగురు మోసుకొనిపోయె యీ వాహనము యిక్కడెందుకు తెచ్చారు? అన్నాడు. నలుగురు మోసుకొనిపోయె వాహనమంటే శ్మశానమునకు తీసుకొనిపోయె వేదిక. అప్పుడు వారు చేతులు జోడించుకొని మహానుభావా శివాజీగారు పంపినారు యిక్కడికి. మీరు అనాథులుగా వుండటం చేత మీరు చేసే కార్యములు చాలా వుత్తమంగా వుండటం చేత దానికి తగిన సామగ్రినంతా పంపిరమ్మన్నారు. స్వామి పైకి చూచాడు ఫక్కున నవ్వాడు. 'రామా! నీ యంతటి గొప్పదేవుడే నాకు గొప్పనాథుడుగా వుం

320068908

టుండగా నేను అనాథుడని ఎట్లా భావించాడు! ఈశివాజి. ఇంతగొప్ప జగత్పతి
యైన భగవంతుడే నాపతిగా వుండినప్పుడు నేనెట్లా అనాథనౌతాను. సర్వులకు నీవే
పతివి. ఒకడెవడైనా అనాథుడున్నాడని విచారణ చేసుకుంటె ఆ అనాథుడవు నీవే
అన్నాడు. కారణమేమనగా నీకింకొక నాథుడు లేడు. సర్వజగత్తుకు నీవే నాథుడు.
నీవే జగన్నాథుడవు. నీవే లోకనాథుడవు. నీవే ప్రాణనాథుడవు. నీవే దేహనాథుడవు.
విశ్వనాథుడవు నీవే. సర్వమునకు నాథుడైన నీవున్నావు. నీకింకొక నాథుడు లేడు. కాబట్టి
రామా నీవే అనాథుడు. కనుక యీ సామానంతా నీవే తీసుకొని పొమ్మన్నాడు. ఈ విధమై
న విశాల భావములు సాధించిన వ్యక్తులు, ప్రపత్తి గలిగిన సాధకులు ఆనాటి వారు.

ఈనాటి వ్యక్తులలో కేవలము మాటలగారడి తప్ప మనసు యేమా
త్రము పరిపక్వస్థితికి రావటం లేదు. 'మాటలు చూస్తే కోటలు దాటుతాయి, కాలు చూస్తే
గడపదాటదు'. అన్నాడు. చెప్ప వచ్చు కోటి చెయ్యరు ఒకటి'. కాని మనము చేస్తున్నా
మా? Duty devotion భగవంతునికి అర్పితము చెయ్యాలి. Dedication అన్నాడు
గోపీచంద్రం. devotion వుండవచ్చు కాని duty ధ్యాసతో చేస్తున్నారా? duty
చేయనప్పుడు devotion వుండి యేమి ప్రయోజనము. ఒక్కొక్కని ఒక్కొక్కరూమ్
మానిటర్‌గా పెట్టాము. తన రూములో వుండిన వ్యక్తులంతా ఏడెనిమిదిమంది నిన్న
భజనకు వచ్చారా! ప్రార్థనకు attend అయినారా తాను చూచుకున్నాడా? యిక తా
నేమి duty చేశాడు. యిలాంటి మానిటర్లే యీ విధమైన పెడమార్గము పట్టిస్తే యిం
క పిల్లలు యేవిధముగా అభివృద్ధి కాగలరు. వీనికి చెప్పే అధికారం యేవిధముగా
వుంటుంది. వీని భక్తి యెక్కడుంటుందాది? ఈనాడు సీటిచ్చేంతవరకు కాళ్ళు వేళ్ళు
పడతారు. సీటిచ్చిన తరువాత చదువయ్యేంతవరకు తల్లిదండ్రులు, వ్యక్తులు చాలా
భక్తిప్రపత్తులు ప్రదర్శిస్తారు. చదువు పూర్తి అయిపోయిందంటె నాటకాలు ప్రారంభిస్తారు.
మా తండ్రికి వళ్ళు సరిలేదు. మా తండ్రికి కనుదృష్టి సరిలేదు. పాపం ఎవరూ లేరు. వాళ్ళ
ను యింటికి పోయి చూచుకోవలసిన బాధ్యత వుంది. ఈ ప్లాను వేస్తారు. ఇంతకాలము
వాళ్ళ తండ్రిని ఎవరు చూచారు! నీ చదువయ్యేంతవరకు మాత్రం తండ్రి బాగుండి
చదువైపోగానే చెడిపోతాడా? దీనికి తగినట్లుగా తల్లితండ్రులు కూడను తాళము
వేస్తారు. చదువైపోయిన తరువాత అక్కడ వాడెందుకు? ఇక్కడ వచ్చేస్తే ఏ మూడు
వేలో, నాలుగువేలో, ఐదువేలో సంపాదించేసి మాతలపైన కొడుతాడు కదా అనే దురాశతో
వారు కూడను ఆ విధముగా ప్లాను. తల్లితండ్రుల దగ్గర పోకూడదని నేను చెప్పటం
లేదు. తల్లితండ్రులసేవ చేయవలసినదే. కాని సక్రమమైన మార్గాన్ని అనుసరించి
తల్లితండ్రుల దగ్గర చేరండి. వారిదగ్గర పోవటానికి యిక్కడ వదలటానికి అసత్య
మైన డ్రామాలు మాత్రం ఆడకండి. అది నాకిష్టం లేదు. ఈ విధమైన డ్రామాలాడటమనేది
కేవలము భగవద్ద్రోహముగాముగా వుంటుంది. భక్తి భక్తి అని అనుకుంటున్నారేగాని

పిల్లలు చాలా మందికి భక్తంటే యేమిటో అర్థము కావటము లేదు. స్వామికెదురుగా కేవలం సంతృప్తయ్యేలు వంటి డ్రామాలు చేస్తే స్వామి తృప్తి పడతారనుకుంటారు.

ఒట్టి మాటలు వాడు కాదన్నా - ఈ సాయి దేవుడు
బుట్ట బొమ్మల చూడ బోడన్నా
గట్టు చేర్చు మటన్న వారిని గట్టి ఊడను పట్టి చూడగ
పట్టు బట్ట కట్టి భక్తుల - చుట్టు తిరిగే పొట్టి స్వామిని
కన్ను విప్పి చూడరో రన్నా.

ప్రతి చిన్న విద్యార్థి యీ పెద్ద విద్యార్థులను కలసుకొని పెడమార్గం పడుతున్నారు. శరీరమునందు పెద్దవారే. క్లాసునందు పెద్ద వారే. డిగ్రీలందు పెద్దవారే. మరి యిక్కడ నివాసము చేసినదానిలో కూడను పదిసంవత్సరములు, పన్నెండు సంవత్సరములు పెద్దవారే. ఇప్పుడు చూడండి.. అక్కడ శరీరము చూడండి. అతనిని నేను భీముడని పిలుస్తాను. అతనేమన్నా ప్రార్థనకు పోతున్నాడా? అతనొక రూమ్ లీడరు. ఇట్లాంటి వారంతా లీడర్సుగా తయారైతే యెంత మంది పిల్లలు పాడై పోతారు. ఇక యీ క్రమశిక్షణను వీరేమి అభివృద్ధి చేయగలరు? ఈ క్రమశిక్షణయే మాకు ప్రధానమైన subject. ఏవిధంగా మీరు సిగ్గులేకుండా వచ్చి మాట్లాడుతున్నారో నాకర్థము కావటంలేదు. చెప్పటమంతా చాలా గొప్పగా చెబుతారు. ఏమిటి వీడి experience. స్వామికి తృప్తిగానటువంటి experience ఎందుకు?

ఎవరైనా రిజిష్టరు కవరు వ్రాసి పోస్టు చేసినారంటే అది చేరినట్లా లేదా అనే దానికి ఎక్నాలెడ్జిమెంటు వాపసు రావాలి. అది రానప్పుడు యిది చేరిందా లేదా అని యేరీతిగా మీరు భావించవచ్చును. తనకు తాను భక్తుడను కావచ్చును. కానీ నానుంచి రావాలి నీవు భక్తుడవయ్యా అని. ఎక్నాలెడ్జిమెంటు రావాలి. అది రావటమే లేదే. నీవెట్లా భక్తుడవు? అది వచ్చే స్థితిని తెప్పించుకున్నవాడే నిజమైన భక్తుడు. కనుక నా ఉద్దేశ్యమేమంటే రిజిస్ట్రారు, వైస్ చాన్సలరు వీరంతా కూడను ముందు చేయవలసిన దేమంటే ఎనిమిది తొమ్మిది సంవత్సరములనుంచి ఇక్కడ వున్న వారందరిని యిక్కడనుంచి పంపించాలి. వారిలో సరియైన వారున్నారు కొంత మంది వున్నారు పాపం. వాళ్లను పెట్టుకొని మనం పనులు చేస్తాం. మన డిసిప్లిన్ మన డివోషన్ మన డ్యూటీని అనుసరించిన వారే యిక్కడుండాలి. మా సంస్థ కేవలము ఒక సత్రము కాదు. చావడి కాదు. ఆదర్శవంతమైన జీవితమును నిరూపించే వ్యక్తులు మాత్రము యిక్కడుండాలి. ఇంతకాలము ఓపిక పట్టుకున్నాము. మారుతారు మారుతారని యెంతో ఆశించినాను. మరింక మారే స్థితిలో లేరు. కనుక యీ విధముగా మారవలసిందే. యింక స్థలాన్ని మార్చవలసిందే. వారికే సంతృప్తి అవుతుంది. ఎందుకంటే వాళ్లకు కూడను యీ వయస్సు వచ్చినప్పుడు యేదో పాస్ చేసుకున్నాం

320068910

ఏదో పోస్టు గ్రాడ్యుయేషన్ అయిపోయింది. తరువాత పిహెచ్‌డి డిగ్రీ తీసుకున్నాం. ఇంక కావలసింది ఒక్కటే. ఇంక వాళ్ళదృష్టి అదే వాళ్ళ ఏకాగ్రత. పెండ్లి కావాలి. ఈ marriage madness తలలో చేరేటప్పటికి వీళ్ళకు దేవుడూ కనబడడు దైవము కనబడదు. సంతోషము. కానీ తల్లితండ్రులకైనా సేవ చేయండి. అక్కడ తల్లితండ్రులకు కాక యికభర్త స్వామికి సంతృప్తి కాకుండా తాను సంతృప్తి లేకుండా కేవలం కుక్కలవలె జీవితాన్ని గడుపుకుంటుంటే యెవరికేమి సుఖము? వాళ్ళదగ్గర నుంచి మేము యేమాత్రము ఆశించటం లేదు. పి.హెచ్.డి boys కు కూడ మేమే డబ్బు యిస్తున్నాము. మేమే చదివిస్తున్నాము. ఈ విధముగా వుంటున్నప్పుడు అలాంటివాళ్ళను యెందుకిక్కడ పెట్టుకోవాలి. కనుక యీ విషయములో మాత్రము యింకపైన సరియైన కట్టుదిట్టము లేకపోతే సంస్థను మూసివేయవలసి వస్తుంది. మంచి పిల్లలు తక్కువ మంది వుండినా చాలును. వారిని పెట్టుకొనే మనము కాలము గడుపుకొందాం. నేను సాయంకాలము ప్రతి దినము యీవిధమైన వుపదేశాలు చేయాలనుకోటానికి యిదే మూల కారణము. పిల్లలతో మాట్లాడించటం, పిల్లలలో వున్న దోషాలు పిల్లలకే చూపటం. నిజమైన గురువు యెవరంటే తన దోషములు తనకు చూపినవాడే నిజమైన గురువు. తన దోషములను తాను అంగీకరించి మంచివి మంచివని చెప్పి తాను చక్కగా అంగీకరిస్తే ఆ శిష్యులను చాలా చెడగొట్టినవాడౌతాడు. ఈ discipline అంతా మీ భవిష్యత్తు రాజమార్గమునకు చేర్చేటువంటిది. కానీ అది మీరు గుర్తించుకోటం లేదు. జీవితాన్నే మీరు పతనం చేసుకుంటున్నారు. విద్యార్థులందరు చక్కగా గుర్తించవలసిన విషయము.

ఈ సంస్థయందు నియమించిన నియమములు తుచ నడచుకోటం యిష్టమున్నవారు వుండవచ్చును. లేనివారు వెళ్ళవచ్చును. మాకు శ్రమ వుండదు. కానీ మీ విద్యాపూర్తయ్యేంతవరకు మాత్రం మంచిగా అంగీకరించి అనేక రకములుగా ప్రామిస్‌లు చేస్తారు కాని యివన్నీ మిస్ లే. ఒక్కడైనా ప్రామిస్‌ను నడచుకున్నవాడు లేడు. కొత్తగా భక్తిగా వచ్చిన పిల్లలు యెంతమందో వుంటున్నారు పాపం. వారి హృదయాలను వారి భావాలను మీరు అశుద్ధపరచకండి. వారు నిశ్చల నిర్మల నిస్వార్థమైన భక్తితో యిక్కడ ప్రవేశించారు. మీరందరు స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై యీ డ్రామాలాడుతున్నారు. మీ భావములంతా కూడను ఆ క్రొత్త విద్యార్థులందు చేరకుండా చూచుకోటానికి ప్రయత్నించండి. ప్రతి మానవునికి భగవద్విశ్వాసమే గాఢముగా వుంటుంటే యిలాంటి దుర్భావములు, యీ దుశ్చేష్టలు వానిలో ప్రవేశించటానికే వీలు లేదు. స్వామిపై మీకు నిజమైన ప్రేమనే వుంటుంటే స్వామి ఆజ్ఞను ప్రాణము పోయినా సరే యేమాత్రం మార్చకూడదు. దీన్ని బట్టి గుర్తించటానికి వీలౌతుంది యిది నిజమైన ప్రేమ కాదు. యిది కేవలము కృత్రిమమైన ప్రేమగా వుంటుండాది. ఈ కృత్రిమ ప్రేమ స్వామిని యేమాత్రము వంచింద లేదు. మిమ్మల్ని మీరే వంచించుకున్నవారౌతారు. నిన్ను నీవు మోసము చేసుకోవద్దు.

నీకు నీవు ద్రోహము చేసుకోవద్దు. 'నొప్పించక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు వేమా!' అన్నారు. నీవూ నష్టపడకుండా, ఇతరులను నొప్పించకుండా నీవూ పతనము కాకుండా, ఇతరులు కూడను పతనము కానీయకుండా చూచుకొనే మార్గాన్ని మనము వెతకాలి. కనుకనే 'త్రోవ వెతుకుకొనుట దొడ్డ బుద్ధి' అన్నాడు ప్రహ్లాదుడు. ఏ త్రోవ వెతుక్కోటం. క్రొత్తగా మనం వెతకనక్కర లేదు. వచ్చిన త్రోవ వెతుక్కోటమే. ఎక్కడ నుంచి వచ్చాము? ఆత్మనుంచి వచ్చాము. తిరిగి ఆ స్థానానికి వెళ్ళాలి. అదే త్రోవ మనము చూసుకోవాలి. కానీ యీనాడు వచ్చిన స్థానము ఒకటి. ప్రయాణం మరొక స్థానానికి పోతున్నాము. కనుకనే మన జీవితం చాలా ఇక్కట్లకు గురై పోతున్నది. మనం వచ్చిన త్రోవను వెతుక్కోవాలి. ఇదే యీనాడు మీకిచ్చే ఉపదేశము. ఇది ద్వాదశాక్షర మంత్రము. 'త్రోవ వెతుకుకొనుట దొడ్డ బుద్ధి'. పన్నెండక్షరాలు. ఆ త్రోవను వెతుక్కోండి. ఏ స్వామి దయను మీరు దూరం చేసుకున్నారో, ఏ స్వామి ప్రేమను మీరు దూరం చేసుకున్నారో, ఏ స్వామి మనసును మీరు నొప్పించినారో ఆ ప్రేమను, ఆ దయను, ఆ స్థానమును చేరటానికి తగిన యిదిని మీరు వెతుక్కోండి.

నాకెప్పుడు unhappy లేదు. Always happy. ఐతే యీ పిల్లలు ఈ విధముగా పాడౌతున్నారే అనే వుద్దేశ్యంతో బాధ వుంటుండాది. happy లేని వారికి happy అందించండి. అంతేగాని నా కోసం నీ happy నాకక్కర లేదు. అనేకమంది birthday వస్తుంది. Happy birthday happy birthday అంటుంటారు. విదేశీయులంతా పాపం. నేను చెప్తుంటాను. I am always happy. నాకు నీ happy అక్కరలేదు. happy లేని వారికి happy నివ్వండి. ఇప్పుడేం చేస్తున్నారు మీరు? మీ తల్లి తండ్రులకు happy లేదు. మీకూ happy లేదు. మీ చుట్టుపరిసరములలో వుండే వారికి happy లేదు. ఇలాంటి జీవితాన్ని మనం ఎందుకు గడపాలి. ఎక్కడికైనా పోయి మీరు happy గా వుండండి. తల్లి తండ్రులకు happy నివ్వండి. ఇంతకాలము వుండినందుకి కనీ యీ ఒక్క ఉపకారమైనా మీ తల్లి తండ్రులకు చేయండి. విద్యార్థులందరు చక్కని క్రమశిక్షణ పాటించి చెడ్డను ఒప్పుకోకుండా పెద్దలను గౌరవిస్తూ చిన్నలపైన కరుణ చూపుతూ సరి సమానులపైన సరియైన మైత్రిని మీరు పెంచుకోండి. ఇదే మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష. ఇవి నాలుగు కూడను చతుర్విధ పురుషార్థములు. ఈ పురుషార్థములను మీరు చక్కగా సార్థకము గావించుకుంటే మీ జన్మయే సార్థకమవుతుంది. కాన మీరు ఒకరికొకరు సరిసమానమైన వారితో సమానమైన భావాన్ని పెంచుకోండి. ద్వేషాలు పెంచుకోకండి. అసూయాభావాలు పెంచుకోకండి. ఆడంబరమైన నాటకాలు ఆడకండి. అహంకారానికి చోటివ్వకండి. వినయముగా, విధేయతగా వుండండి. 'విద్యా వినయ సంపన్నే' వినయమనేదే లేదు. ప్రశాంతి నిలయము వచ్చినప్పుడు మాత్రమే దీనిని ప్రదర్శిస్తున్నారు. నిన్నటి దినము చెప్పటంచేత నిన్న రాత్రి ఎట్లా వుంది? హాస్టలంతా నిశ్శబ్దంగా వుంటుండాది. ఈ విధమైన పరిస్థితి

లు కేవలము ఒకటి రెండు దినములు మాత్రమే. మన discipline ఆవిధముగా వుండకూడదు. నీ నీడ యే విధముగా నిన్ను వెంటాడుతుందో మన discipline మన వెంటనే వుంటుండాలి. మన నీడ వంటిదిగా వుంటుండాలి. ఇక్కడ వుంటుండు. మార్కెట్టుకు పో. బజారుకు పో; యింటికి పో; యింకెక్కడికైనా పో. నీ shadow నీ వెంట వస్తుంటూది కదా! అదే రీతిగా యీ discipline వెంటనే వుంటుండాలి. ఇదే సత్యమైన discipline. ఇప్పుడు మీరు ప్రకటించేదంతా కూడను కృత్రిమమైన discipline. నేను ప్రదర్శనను కోరటంలేదు. నిదర్శనను కోరుతున్నాను. కించిత్తైనా సరే. దానికి సరియైన విలువనిచ్చే సారముంటుండాలి. కనుక మీరు మీ ప్రవర్తనయందు, మీ మాటలయందు, మీ చేష్టలయందు అన్నింటియందు కూడను సరియైన భావాన్ని పెట్టుకోండి. మీరే బాగుపడతారు. ఇదే నిజమైన చదువు. ఈ చదువు లేకుండా కేవలము ప్రాకృతమైన చదువులు యెన్ని సంపాదించుకున్నప్పటికిని, ఎన్ని చదివినప్పటికిని ప్రయోజనము లేదు. ఏదో ధనమును సంపాయించవచ్చును. ప్రాకృతమైన అనుకూలములు చేసుకోవచ్చును. కానీ మానసిక శాంతి ఎవరిస్తారు? మానవునికి శాంతి అతిప్రధానమైనది. నిత్యము మీరు భజనలోగాని, యింకెక్కడగాని చెప్తూనే వుంటుంటారు. 'శాంతి శాంతి శాంతిః' యీ మూడు తూర్లు చెప్పటంలో వుండేన అంతరార్థమేమిటి? దేహరీతిగా శాంతి, మనోరీతిగా శాంతి, ఆత్మరీతిగా శాంతి. ఇదే మూడు తూర్లు శాంతి కావాలి. అదికూడా ఏ రీతిగా? అదికూడా శాంతిగానే వుంటుండాలి. శాంతి శాంతిగానే వుంటుండాలి. శాంతి శాంతి శ్శాంతిః యిట్లు పోవాలిగాని శాంతి శాంతి శాంతి ఈ శాంతిలో కూడను క్రోధము వుంటుంటే యిక శాంతి నీకెక్కడ లభిస్తుంది. కనుక ఈ P.hd పిల్లలందరు తగిన జాగ్రత్తను వహించి క్రమక్రమేణా మంచి స్థానాలకు పోవటానికి తగిన యేర్పాట్లు చేసుకోండి. దీనికి మున్ముందు తగిన రీతిగా తగిన చర్య రిజిస్ట్రారు, వైస్ ఛాన్సలర్ తీసుకోవాలి.